నమస్తే తెలంగాణ
# జనగామ
5 | శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | JANAGAON

## కాళేశ్వరం ఈఎన్‌సీగా సుధాకర్‌రెడ్డి



జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ఎత్తిపోతల (రామగుండం) ఈఎన్‌సీగా కొట్టె సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన నల్లా వెంకటేశ్వర్లును ప్రభుత్వం ఇటీవల ఆ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. కాగా, జగిత్యాలలో ఇరిగేషన్ శాఖ సీఈగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. మేడిగడ్డ బరాజ్ మరమ్మతు బాధ్యతలు ఆయన భుజానపడ్డాయి.



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

ఆరుగాలం కష్టపడి మిరపకాయలు పండించిన రైతు.. తీరా వాటిని అమ్ముకునేందుకు అరిగోసపడుతున్నాడు. పంటను ఎప్పుడు కొంటారా.. అని మార్కెట్‌లో రోజుల తరబడి నిరీక్షిస్తున్నాడు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు పరిమితికి మించి మిర్చి విక్రయానికి వచ్చిందన్న కారణంతో అధికారులు కాంటాలను ఆలస్యం చేయడంతో మార్కెట్‌లో రైతులు ముప్పుతిప్పలు పడుతున్నారు.

# అమ్ముకునేందుకే అరిగోస

## మిర్చి రైతుల అష్ట కష్టాలు

**పంటను పండించిన దానికంటే అమ్మడానికే ఎక్కువ తిప్పలు**

**కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో రోజుల తరబడి పడిగాపులు**

**పరిమితికి మించి మిర్చి వస్తోందన్న సాకుతో వరుస సెలవులు**

**ఇదే అదునుగా ధరలు తగ్గిస్తున్న వ్యాపారులు**

**కమీషన్ పేరుతో నగదులో 3శాతం కోత**

కేసముద్రం, ఫిబ్రవరి 15 : కేసముద్రం మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకొచ్చిన రోజే కాంటాలు పెట్టి, అదే రోజు రైతులను ఇంటికి పంపించాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ అలా జరగడం లేదు. ఎప్పటికప్పుడు కాంటాలు పెట్టకపోవడంతో మిర్చి రైతులు మార్కెట్‌లోనే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఈ నెల 12న 8 వేల బస్తాల మిర్చి విక్రయానికి రాగా, పరిమితికి మించి వచ్చిందన్న కారణంతో అధికారులు రెండు రోజులు మార్కెట్‌కు సెలవులు ప్రకటించారు. తిరిగి మార్కెట్ గురువారం ప్రారంభంగా కాగా, 6 వేల బస్తాల మిర్చి వచ్చింది. పరిమితికి మించి వచ్చిందని మళ్లీ అధికారులు కాంటాలను రేపటికి వాయిదా వేశారు. దీంతో రైతులు రెండు రోజుల పాటు మార్కెట్‌లోనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇలా వరుస సెలవులు ఉంటుండడంతో రైతులు నేరుగా ట్రేడింగ్ కంపెనీలకు వెళ్లి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారు. కాగా నేటి నుంచి మళ్లీ మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

### కమీషన్ పేరుతో 3శాతం నగదులో కోత..

ఈ -నామ్ విధానంలో వ్యాపారులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయాలి. లేదా సరుకు అమ్మిన రోజు తేదీతో చెక్కు రూపంలో ఇవ్వాలి. అందుకు విరుద్ధంగా వ్యాపారులు నగదు చెల్లిస్తూ కోత విధిస్తున్నారు. మిర్చి కొనుగోళ్లలో 3 శాతం, ఇతర పంటల కొనుగోళ్లలో 2శాతం కటింగ్ చేస్తూ దోచుకుంటున్నారు.



### మళ్లీ ఇంటికి తీసుకెళ్లా..

మార్కెట్‌కు సెలవులు ఇవ్వడం, మార్కెట్ ప్రారంభం రోజు ఎక్కువ మిర్చి విక్రయానికి వస్తుండడంతో ఇదే అదునుగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పూర్తిగా తగ్గిస్తున్నారు. ఈ నెల 12న మార్కెట్‌కు 8 బస్తాల నాణ్యమైన మిర్చి, 4 బస్తాల తాలు మిర్చి తీసుకెళ్లా. పరిమితికి మించి మిర్చి విక్రయానికి వచ్చిందని వ్యాపారులు ఆ రోజు రాత్రి ధరలు నిర్ణయించి కాంటాలు మరుసటి రోజు పెట్టారు. నాణ్యమైన 8 బస్తాల మిర్చి క్వింటాల్‌కు రూ.17 వేలు పలకడంతో అమ్ముకోకుండా మిర్చి బస్తాలను ఇంటికి తీసుకెళ్లాను. 4 బస్తాల తాలు మిర్చిని క్వింటాలుకు రూ.11వేల చొప్పున అమ్ముకోగా రూ.18,270 రావాల్సి ఉంటే 3 శాతం కటింగ్‌తో రూ.540 తగ్గించి ఇచ్చారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కమీషన్‌ను తొలగించి రోజూ మార్కెట్‌లో కొనుగోళ్లు చేపట్టాలి.

– చెన్నబోయిన వీరన్న, రైతు, పెనుగొండ



ట్రేడింగ్ కంపెనీలకు తరలిన మిర్చి



జాతీయ రహదారి డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు ఎండిపోగా, ఖాళీగా కన్పిస్తున్న ట్రీ గార్డులు, కర్రలు

# పచ్చదనంపై పట్టింపేది?

## నీళ్లు లేక ఎండిపోతున్న హరితహారం చెట్లు

**జాతీయ రహదారి వెంట బోసిపోతున్న ట్రీ గార్డులు, కర్రలు**

**పల్లె ప్రకృతి వనాల వైపు కన్నెత్తి చూడని అధికారులు**

**మొక్కల సంరక్షణను మరిచిన జీపీ సిబ్బంది**

పట్టణాలు, గ్రామాల్లో పచ్చదనం కొరవడుతోంది. రహదారులపై హరితహారం మొక్కలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. పల్లె ప్రకృతి వనాల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మొక్కలు ఎండిపోయి పార్కులు కళా విహీనంగా కన్పిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది సైతం మొక్కల సంరక్షణను గాలికొదిలేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోయి ట్రీ గార్డులు, కర్రలు మాత్రమే మిగిలాయి. మండలంలోని పల్లె ప్రకృతి వనాల్లో నీరందక మొక్కలు ఎండిపోతున్నా అధికారులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ములుగురూరల్, ఫిబ్రవరి 15



జాతీయ రహదారి వెంట ఎండిపోయిన మొక్కలు

పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నేడు ఆదరణ కోల్పోతున్నాయి. నీళ్ల లేక చెట్లు ఎండిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో పల్లెల్లో పచ్చదనం మాయమవుతోంది. ఎవెన్యూ ప్లాంటేషన్ కింద జాతీయ రహదారిపై, డివైడర్ల మధ్యలో నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయి చెట్లకు రక్షణగా ఉంచిన ట్రీ గార్డులు మాత్రమే మిగిలాయి. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం మొక్కల సంరక్షణ చేపట్టాల్సిన జీపీ అధికారులు ప్రభుత్వం మారిన అనంతరం పట్టించుకోవడమే మానేశారు.

### ట్రాక్టర్లు, ట్యాంకర్లేవీ?

హరితహారం మొక్కలు, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణ కోసం కేసీఆర్ ప్రభుత్వం జీపీలకు ట్రాక్టర్‌తో పాటు ట్యాంకర్లను సమకూర్చింది. నీళ్లు పట్టేందుకు వలంటీర్లను సైతం నియమించింది. నేడు ఆ పనులేవీ జరిగినట్లు కనిపించడం లేదు. ములుగు జిల్లా కేంద్రం నుంచి గట్టమ్మ మొదలుకొని జంగాలపల్లి వరకు జాతీయ రహదారికి ఇరువైపులా చాలా వరకు మొక్కలు ఎండిపోగా, పదుల సంఖ్యలో కొనఊపిరితో ఉన్నాయి.

### అంతటా ఇదేతంతు..

పల్లె ప్రకృతి వనాల్లో బోరు బావులు ఉన్నా మొక్కలకు నీళ్లు పట్టే చర్యలు మాత్రం కరువయ్యాయి. ములుగు జిల్లా కేంద్రంతో పాటు ఇంచర్ల, శివతండా, రంగారావుపల్లి, పాల్‌సాబ్‌పల్లి, మదనపల్లి, జగ్గన్నపేట, రామచంద్రాపురం, జాకారం, దేవగిరిపట్నం, పత్తిపల్లి, కాసిందేవి పేట, అంకన్నగూడెం, సర్వాపురం, మహ్మద్‌గౌస్‌పల్లిలోని పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. హరితహారం మొక్కలకు సైతం ఇదే దుస్థితి పట్టింది.



రామతీర్థం రెవెన్యూ పరిధి దట్టకుంట ప్రభుత్వ భూమిలో ధ్వంసమైన పల్లె ప్రకృతి వనం

## ప్రకృతి వనాల ఆక్రమణకు యత్నం

### పార్కులను ధ్వంసం చేస్తున్న దుండగులు

నల్లబెల్లి, ఫిబ్రవరి 15: మండలంలో పల్లె ప్రకృతి వనాలను ధ్వంసం చేసి స్థలాలను ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు మిన్నకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని రుద్రగూడెం, నల్లబెల్లి, రామతీర్థం గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలకు నిప్పు పెట్టి ధ్వంసం చేయడంతోపాటు ఏకంగా డోజర్లతో ఇక్కడి ప్రభుత్వ స్థలాలను చదును చేసి ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారు. అర్వయ్యపల్లె రెవెన్యూ పరిధి శివారులోని దట్టకుంటలో సర్వే నంబర్ 29లో 5.18 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. ఈ స్థలంలోని 20 గుంటల భూమిలో సుమారు రూ.10 లక్షలు వెచ్చించి పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్థలంపై కన్నేసిన ఓ వ్యక్తి రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా డోజర్‌తో నెట్టి ఆక్రమించుకునేందుకు యత్నించాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అఖిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్థానిక ఎంపీవో కూచన ప్రకాశ్‌ను వివరణ కోరగా పల్లె ప్రకృతి వనం ధ్వంసంపై పోలీసులే చూసుకుంటారని తెలిపారు. ఎస్సై నైనాల నగేష్‌ను అడుగగా తమ విచారణలో ఓ వ్యక్తిని గుర్తించినా సంబంధిత కార్యదర్శి అతనిపై తమకు మరో పిటిషన్ ఇస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు. కలెక్టర్ స్పందించి పల్లె ప్రకృతి వనాలను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పార్కులను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## కవి, రచయిత నల్లెల రాజయ్య అస్తమయం

### సాహితీవేత్తల ప్రగాఢ సంతాపం



పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 15: ప్రముఖ రచయిత, ప్రజా కవి, విశ్రాంత ఉపాధ్యాయుడు, దివ్యాంగుల సంఘం నాయకుడు నల్లెల రాజయ్య (62) కన్నుమూశారు. ములుగు జిల్లా జాకారానికి చెందిన ఆయన హనుమకొండలోని పద్మాక్షమ్మ గుట్ట వద్ద నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. రాజయ్య అనేక కవితలు, వ్యాసాలు రాసి ప్రజలను చైతన్యం చేశారు. అలాగే ఉపాధ్యాయ, దివ్యాంగుల సమస్యలపై గళమెత్తారు. సామాన్యులకు వెన్నుదన్నుగా నిలుస్తూ పేరు సంపాదించుకున్నారు. వరంగల్ రచయితల సంఘం ద్వారా అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. విలువైన రచనలను సమాజానికి అందించారు. ఆయన ఆకాల మృతిపై సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు, తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పీ శ్రీనివాస్‌రావు, సభ్యులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**తెలుగు సాహితీ ప్రపంచానికి తీరని లోటు...**

కవి నల్లెల రాజయ్య మరణం తెలుగు సాహితీ ప్రపంచానికి తీరని లోటని కాళోజీ ఫౌండేషన్, మిత్ర మండలి బాధ్యులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, అంపశయ్య నవీన్, పందిళ్ల అశోక్‌కుమార్, ఆగపాటి రాజ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ప్రజలను చైతన్యపరిచారని వారు పేర్కొన్నారు. కవి రాజయ్య పార్థివదేహానికి పలువురు కవులు, రచయితలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# జాతరలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

**పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలి**

**1.50 కోట్ల మంది భక్తులకు సౌకర్యాలు**

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**కొలువుదీరిన మహాజాతర ఉత్సవ కమిటీ**

**ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి15 : మేడారం మహా జాతరలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం మేడారం హరితహోటల్‌లో పారిశుధ్య నిర్వహణపై శిక్షణ, సమ్మక్క భవన్‌లో మహా జాతర ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమాలకు మంత్రి హాజరయ్యారు.ఉత్సవ కమిటీ చైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్, సభ్యులుగా మిలుకూరి ఐలయ్య, కొండి గోపాల్, గిర్ల రాజారత్నం, కొంపల్లి శ్రీనివాసరెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణసింగ్, ముంజాల భిక్షపతి, చుంచు హైమావతి, చామర్తి కిశోర్, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్రం, అంకం కృష్ణస్వామి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రమాణ స్వీకారం చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ జాతర సమయం దగ్గర పడుతున్నందున భక్తుల తాకిడి రోజు రోజుకూ పెరిగే అవకాశాలున్నాయన్నారు. ఇందుకు అనుగుణంగా పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జాతర కోసం భక్తులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. 1.50 కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాలతో సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఇప్పటికే 30లక్షల మంది అమ్మవార్లను దర్శించుకున్నారని, జాతర విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మహాజాతర నిర్వహణ సక్రమంగా జరిగేందుకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు. ఆదివాసీ బిడ్డగా, మహిళా మంత్రిగా అమ్మవార్లకు సేవ చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. జాతరలో పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రం మాట్లాడుతూ జాతరలో అధికారులు చిత్త శుద్ధి, సమన్వయంతో సేవలు అందించాలని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జాతరకు విధులు కేటాయించి అధికారులు ఈ నెల 19 నుంచి అధికారులకు రిపోర్టు చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ అధికారులకు కేటాయించిన జోన్లలో విధులు నిర్వర్తిస్తూ పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డాక్టర్ పీ శబరీష్, డీపీవోలు, డీఎల్‌పీవోలు, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

# కేయూ గర్ల్స్ హాస్టల్‌లోకి బుర్ఖాతో యువకుడు

**పట్టుకున్న విద్యార్థులు.. పోలీసులకు అప్పగింత**

**కౌన్సిలింగ్ ఇచ్చి పంపిన కేయూ పోలీసులు**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 15: కాకతీయ యూనివర్సిటీలోని పోతన గర్ల్స్ హాస్టల్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థిని, మంగళవారం రాత్రి 10గంటలకు బుర్ఖా వేసుకున్న యువకుడితో బైక్‌పై వచ్చి మొదటి గేటు నుంచి లోపలికి రావడం చూసి కొందరు విద్యార్థులు అడ్డుకున్నారు. బుర్ఖా వేసుకున్న వ్యక్తి బూట్లను చూసి అనుమానం వచ్చి నిలదీయగా అతడు యువకుడు అని తెలిసి దాడి చేశారు. విషయాన్ని కేయూ హాస్టల్ డైరెక్టర్ శ్రీనివాసరావుకు తెలియజేయగా కేయూ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తీసుకొచ్చిన విద్యార్థినిని యూనివర్సిటీ అధికారులు మందలించి వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేసు పెట్టలేదని, ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యార్థినిని వారం పాటు సస్పెండ్ చేస్తున్నట్లు కేయూ హాస్టల్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.



అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

# వనదేవతలకు నీరాజనం

**మేడారానికి పోటెత్తుతున్న భక్తులు**

**రాత్రి, పగలు రోజంతా మొక్కులే**

తాడ్వాయి, ఫిబ్రవరి15 : వనదేవతలు సమ్మక్క-సారలమ్మకు భక్తులు నీరాజనాలు పలుకుతున్నారు. గంటల తరబడి లైన్లలో నిల్చుని అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రైవేట్, ఆర్టీసీ బస్సుల్లో మేడారానికి చేరుకున్నారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం వాగు ఒడ్డున గల నాగులమ్మ, జంపన్న గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సంతాన ముడుపులు కడుతున్నారు. సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు సమర్పించి గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. రోజంతా దర్శనాలు చేసుకుంటున్న భక్తుల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ రాత్రి వేళలో కూడా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఇందుకు అనుగుణంగా దేవాదాయ శాఖ అధికారులు సైతం ఏర్పాట్లు చేశారు.

**భక్తులతో నిండిపోయిన వనాలు**

వివిధ ప్రాంతాల నుంచి గురువారం భారీగా తరలివచ్చిన భక్తులతో జాతర పరిసరాలు జనమయంగా మారాయి. తాడ్వాయి నుంచి మేడారం, మేడారం నుంచి పస్రా, కాల్వపల్లి, బయ్యక్కపేట, చిలకలగుట్ట తదితర ప్రాంతాల్లో విడిది చేశారు. రోజంతా పచ్చని అడవిని ఆస్వాదిస్తూ విందు భోజనాలు చేస్తున్నారు.



జంపన్నవాగులో శివసత్తుల పూనకాలు